

తగ్గుతున్న పెట్టుబడి.. పెరుగుతున్న దిగుబడి 8లో

ద్రవరూప ఎరువులతో పంటకు సుమారు 90 శాతం ప్రయోజనం ఉంటుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.



చకచకా నిర్మాణ పనులు 8లో

నర్సాపూర్: మున్సిపల్ అభివృద్ధికి కేంద్రం బిందువైన మున్సిపల్ కార్యాలయ పక్కా భవనం పనులు చకచకా సాగుతున్నాయి.

10న స్పాట్ అడ్మిషన్

నర్సాపూర్‌రూరల్: ఈ నెల 10న గిరిజన గురుకుల కళాశాలల ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రామేశ్వరమ్మ తెలిపారు. మండలంలోని నారాయణపూర్ బాలికల గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ సీఈసీలో 7, హెచ్ఈసీ 30 సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఉదయం 11గంటలకు చేగుంట బాలికలగిరిజన గురుకుల కళాశాలలో హాజరు కావాలన్నారు.

మట్టిదీపం ఆలోచనతోనే

అమరజ్యోతి

- దీని కోసం నాలుగు మోడల్స్ తయారు చేశా
- మూడున్నరేళ్లలో నిర్మాణం పూర్తయ్యింది
- సాక్షితో అమర జ్యోతి శిల్పి మాచెన్నగారి వెంకటరమణారెడ్డి



సాక్షి, సిద్దిపేట: ''చిన్నతనం నుంచే శిల్పాలు తయారు చేయడం ఎంతో ఇష్టం..రాష్ట్రసాధన కోసం ఉద్యమాలు జరుగుతున్న సమయంలోనే ఇక్కడ వచ్చాను. సచివాలయం వద్ద అమరజ్యోతి నిర్మాణం పూర్తి చేయడానికి మూడున్నరేళ్లు పట్టిందని'' తెలంగాణ అమర జ్యోతి శిల్పి మాచెన్నగారి వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం సిద్దిపేటకు వచ్చిన సందర్భంగా ఆయనను 'సాక్షి' పలకరించింది. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే...

నాలుగు రకాలుగా..

అమర జ్యోతి కోసం అద్భుతమైన సంస్మరణ నిర్మాణానికి డిజైన్ ఇవ్వాలని సీఎం కేసీఆర్ చెప్పడంతో నాలుగు మోడల్స్‌లో చూపించాను. అందులో ప్రస్తుతం నిర్మించిన అమర జ్యోతి మోడల్‌కు సీఎం కేసీఆర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వెంటనే పనులు ప్రారంభించి మూడున్నర సంవత్సరాల్లో పూర్తి చేశాం. మట్టి దీపం ఆలోచన స్ఫూర్తితో అమర జ్యోతిని డిజైన్ చేశా. అమరుల త్యాగాలు భవిష్యత్ తరాలకు కాంతి ఇవ్వాలని, అందరికీ స్ఫూర్తి కావాలనే ఆకాంక్షతోనే ఈ డిజైన్ రూపొందించా. దీపం అనేది ప్రపంచ దేశాల్లో ఎక్కడకు వెళ్లినా నివాళిగానే చూస్తారు.

మాది సిద్దిపేటనే...

కుకునూరుపల్లి మండలం లకుడారం నా స్వగ్రామం. సిద్దిపేటలోనే మల్టీపర్పస్ స్కూల్‌లో ప్రాథమిక విద్య, ఇంటర్ ప్రభుత్వ కళాశాలలో పూర్తి చేశాను. నాలుగో తరగతి చదువుతున్నప్పుడు నా ఫ్రెండ్స్ ఊర్లో చిర్ర గోనె, కోతి కొమ్మచ్చి ఆటలు ఆడుకుంటుంటే నేను చెరువు, కాలువల మట్టితో విగ్రహాలు తయారు చేశాను. స్కూల్‌లో కాపు రాజయ్య డ్రాయింగ్ నేర్పించేవారు. అలా మరింత ఆసక్తి పెరిగింది. 1985 సంవత్సరంలో జేఎన్‌టీయూలో ఫైన్‌ఆర్ట్స్‌లో జాయిన్ అయ్యాను. 1991 కోర్సు పూర్తి చేసి, గోల్డ్ మెడల్ సాధించాను. నాన్నకు ఆర్టిస్ట్ కావడం ఇష్టం లేకపోవడంతో సైన్ బోర్డులోకి ఎంటర్ అయ్యాను. ఇతర రాష్ట్రాల్లో పెద్ద హోర్డింగ్‌లలో ఆర్ట్ వేశాను. బరోడాలో శిల్పకళలో పీజీ పూర్తి చేశాను. మన సంస్కృతిని బయట ప్రాంతాలకు తెలియజెప్పేందుకు జర్మనీకి భారత ప్రభుత్వం పంపించింది. అక్కడ ఆరునెలలు ఉన్నా. అలా మొదలైన నేను 14 ఏళ్లపాటు అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, కెనడా, ఇంగ్లాండ్ దేశాలలో శిల్ప కళ ప్రదర్శనలు ఇచ్చా.


సండే స్పెషల్



సీఎం కేసీఆర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వెంకటరమణారెడ్డి

ఉద్యమంలో పాల్గొనేందుకు

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమం జరుగుతున్న సమయంలో ఇండియాకు వచ్చా. జేఏసీ పిలుపునిచ్చే ప్రతీ కార్యక్రమానికి పోస్టర్లు తయారు చేశాను. తెలంగాణ మ్యాప్‌లో పిడికిలి ఉండే విధంగా ఆర్ట్ వేశాను. తెలంగాణ మ్యాప్‌లో పిడికిలి చిత్రాలు టీ షర్టు పై అచ్చు వేయించుకుని ఉద్యమంలో యువత పాల్గొన్నారు. 2007 సంవత్సరంలో శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు ఆర్ట్ కన్సల్టెంట్‌గా జీఎంఆర్ సంస్థ నియమించింది. పార్క్‌హయత్, నోవాటెల్‌లో చాలావరకు నా శిల్పాలున్నాయి. ఢిల్లీలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తొలి తెలంగాణ శకటం రూపొందించే అవకాశం నాకు దక్కింది. తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా పలు జిల్లాల్లో ఆర్ట్ క్యాంప్‌లు ఏర్పాటు చేశాను. ఈ క్యాంప్‌లను మొదటగా సిద్దిపేట నుంచే ప్రారంభించాను.



అమరజ్యోతి వద్ద శిల్పి వెంకటరమణారెడ్డి

మూడు మార్లు ఏకగ్రీవంగా

2015 నుంచి హైదరాబాద్ ఆర్ట్ సొసైటీకి అధ్యక్షుడిగా కొనసాగుతున్నాను. మూడుసార్లు నన్ను ఏకగ్రీవంగానే ఎన్నుకున్నారు. సిద్దిపేట కళాకారులకు స్టూడియోల కోసం స్థలాలను కేటాయిస్తే కళాకారులు మరింత వెలుగులోకి వస్తారు. సిద్దిపేట కవులు, కళాకారులకు పుట్టినిల్లు. స్టూడియో ఏర్పాటు చేయడం వల్ల మన ప్రాంతీయ కళలను గుర్తించేందుకు దోహదపడుతుంది. త్వరలో సిద్దిపేటలో ఆర్ట్ క్యాంప్ ఏర్పాటు చేస్తాను.

2015లో ఉత్తమ శిల్పి అవార్డు

రాష్ట్ర ప్రభుత్వం 2015లో ప్రథమ ఉత్తమ శిల్పి అవార్డును ఇచ్చి సత్కరించింది. తెలుగు యూనివర్సిటీ నుంచి విశిష్ట పురస్కార్, కళారత్న, కళాభీష్మ ఇలా అనేక అవార్డులు వచ్చాయి.

న్యూస్‌రీల్

పేస్కేలు అమలు చేయాలి



మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న జేఏసీ ప్రతినిధులు

నర్సాపూర్: పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలో పని చేస్తున్న ఉపాధిహామీ ఉద్యోగులకు పే స్కేలు అమలు చేయాలని జేఏసీ నాయకులు కోరారు. శనివారం నర్సాపూర్‌కు వచ్చిన మంత్రి హరీశ్‌రావును కలిసి వినతి పత్రం అందించారు. ఉపాధిహామీ ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు అంజిరెడ్డి, జిల్లా జేఏసీ అధ్యక్షుడు రాజ్‌కుమార్, మహిపాల్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, బాలయ్య, నాగేందర్, యాదగిరి, మురళీ ఉన్నారు.

ఏబీవీపీ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

మెదక్ కలెక్టరేట్: విద్యార్థులు స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ శశికాంత్ అన్నారు. ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించి, విద్యారంగానికి నిధులు పెంచాలని కోరారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ఉదయ్, నాయకులు నితిన్, అనిల్, సుదీప్, మారుతి, వర్షిత్, మణికంఠ, సుదీక్ష్, విజ్ఞాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

మెదక్‌జోన్/నర్సాపూర్: ప్రయాణికులకు ఆర్థిక భారం తగ్గించి, సేవలను విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు మెదక్ డిపో మేనేజర్ రవిచందర్ తెలిపారు. పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణించే మహిళలు, సీనియర్ సిటిజన్ల కోసం టి9 టికెట్ ప్రవేశపెట్టామని, ఈ టికెట్‌తో ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు 60 కిలోమీటర్ల పరిధిలో ఒకసారి రానూ, పోను ప్రయాణం చేయవచ్చన్నారు. రూ.100 చెల్లించి ఈ టికెట్ కొనుగోలు చేసే ప్రయాణికులు తిరుగు ప్రయాణంలో రూ.20 కాంబినేషన్ టికెట్‌తో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కూడా ప్రయాణించవచ్చన్నారు. ప్రయాణికులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు 040-69440000, 040-23450033 నంబర్లలో సంప్రదించాలన్నారు.


సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్): పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో కార్మికులతో కలిసి సమ్మెలో పాల్గొని మాట్లాడారు. ఏళ్లుగా పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించే వరకు సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆసిఫ్, కార్మిక సంఘం నాయకులు స్వామి, భాస్కర్, దేవమ్మ, బాలమణి, శోభ, మైసమ్మ, యాదగిరి, భిక్షపతి, సురేష్, లక్ష్మయ్య తదితరులున్నారు.

104వ రోజు దీక్ష



దీక్షలో అఖిలపక్ష నాయకులు

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ సాధనకు రామాయంపేటలో కొనసాగుతున్న దీక్షలు శనివారం 104 రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం డివిజన్ మంజూరు చేసే వరకు దీక్షలు విరమించమని అఖిలపక్ష ప్రతినిధులు పేర్కొన్నారు. దీక్షలకు కుల సంఘాలతోపాటు వ్యాపార, యువజన సంఘాలు మద్దతు ప్రకటించాయి.

బ్రిడ్జితో ఇబ్బందులు దూరం

ఎమ్మెల్యే మదన్ రెడ్డి, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ సునీతారెడ్డి



బ్రిడ్జిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, కలెక్టర్ రాజర్షిషా తదితరులు

కొల్చారం(నర్సాపూర్): నర్సాపూర్- మెదక్ ప్రధాన రహదారి పోతంశెట్టిపల్లి శివారు నుంచి ఏడుపాయల వనదుర్గ ఆలయం వరకు నిర్మించిన బ్రిడ్జితో రైతులు, భక్తులకు సౌకర్యంగా ఉంటుందని ఎమ్మెల్యే మదన్ రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. శనివారం కలెక్టర్ రాజర్షి షాతో కలిసి బ్రిడ్జిని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. లోలెవెల్ కాజ్‌వే (రెండు వరసల రహదారి, వంతెన) నిర్మాణం కోసం సాగు నీటి పారుదల ఆయకట్టు అభివృద్ధి శాఖ నుంచి రూ.31.31 కోట్లు ఖర్చు చేశామన్నారు. బ్రిడ్జి నిర్మాణంతో మంజీరా పరిసర రైతులతో పాటు, వన దుర్గా దేవి దర్శనానికి వచ్చే భక్తులకు దూరం తగ్గుతుందన్నారు. అనంతరం రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ కోరబోయిన మంజుల, జెడ్పీటీసీ ముత్యంగారి మేఘమాల, సర్పంచ్ నాగరాణి, ఎంపీటీసీ భాగ్యలక్ష్మి, మార్కెటింగ్ కమిటీ వైస్ ఛైర్మన్ సావిత్రి, జిల్లా కోఆప్షన్ మెంబర్ మన్సూర్, ఏడుపాయల ఆలయ ఈఓ శ్రీనివాస్ గౌడ్, డైరెక్టర్ యాదగౌడ్, ఇరిగేషన్ అధికారులు శ్రీనివాసరావు, ఏసయ్య, అంసాన్పల్లి సర్పంచ్ శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గౌరీ శంకర్ గుప్తా, నాయకులు నరేందర్ రెడ్డి, యాదయ్య, వెంకట్ గౌడ్, ఆంజనేయులు, రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులు సరికాదు

మెదక్ కలెక్టరేట్: వరంగల్ పర్యటనకు ప్రధాని మోడీ వస్తుండడంతో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావును పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదని జిల్లా కార్యదర్శి ఖాలేక్ అన్నారు. శనివారం మెదక్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టంలో హామీలను కేంద్రం నెరవేర్చలేదని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు విజయలక్ష్మి, కొత్త శేఖర్, దుర్గాగౌడ్, కిషన్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి శ్రవన్‌కుమార్



యూత్ అధ్యక్షులను సన్మానిస్తున్న నాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామ, బూత్ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని యూత్ కాంగెస్ జాతీయ కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి శ్రవన్‌కుమార్ కార్యకర్తలకు సూచించారు. శనివారం ధర్మసాగర్‌గేట్‌వద్ద నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్ యూత్ డిక్లరేషన్, వరంగల్ రైతు డిక్లరేషన్‌ను ప్రజలకు వివరించాలని, వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోని రాగానే రైతు రుణమాఫీ, రూ.4వేలు పింఛన్, నిరుద్యోగ భృతి, ఫీజు రీయంబర్స్‌మెంట్ హామీలు నెరవేరుస్తామన్నారు. బూత్ జోడో, యూత్ జోడో కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన యూత్ అధ్యక్షుడు ధన్‌సింగ్, కృష్ణను సన్మానించారు. అనంతరం దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. శిక్షణ కార్యక్రమ ఛైర్మన్ అర్పిత్, జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, అసెంబ్లీ అధ్యక్షుడు రియాజ్‌అలీ, ఉపాధ్యక్షుడు సందీప్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, ఆయా మండలాల యూత్ అధ్యక్షులు ధన్‌సింగ్, కృష్ణ, శీను, మహేష్, పోచయ్య పాల్గొన్నారు.

చాకరిమెట్లలో ప్రత్యేక పూజలు

ఆంజనేయస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. రెండో శనివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యనారాయణస్వామి మండపంలో భక్తులు సామూహిక వ్రతాలు ఆచరించారు. దాతల సహకారంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, ఛైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన అర్చకులు దేవదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ, శ్రీవాత్సవ్‌శర్మ, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ పూజలు

మండలంలోని చిన్నగొట్టిముక్ల గ్రామ పరిధిలోని చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామిని శనివారం ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఫౌండర్, ఛైర్మన్ ఆంజనేయశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆంజనేయస్వామితో పాటు సీతారామచంద్రస్వామి, సత్యనారాయణస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ సారా శ్రీనివాస్, ప్రధాన అర్చకులు దేవదత్తశర్మ, ప్రభుశర్మ, సిబ్బంది శ్రీనివాస్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మంచి చేసిన వారిని మరువొద్దు

- రిజర్వేషన్‌తో గిరిపుత్రులకు మేలు
- పోడు పట్టాల పంపిణీలో మంత్రి హరీశ్‌రావు



పోడు పట్టాలు అందిస్తున్న మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, మదన్‌రెడ్డి

మెదక్‌జోన్/నర్సాపూర్: మంచి చేసిన వారిని మరువొద్దని, గిరిజనుల అభివృద్ధికి అనేక పథకాలను ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం నర్సాపూర్‌ని ఓ ఫంక్షన్ హాల్‌లో 610 మంది గిరిజనులకు 520 ఎకరాల పోడు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏళ్లుగా ఎదురు చూసిన గిరిజనుల కలను సీఎం సాకారం చేశాడని కొనియాడారు. పట్టాలతో ధరణిలో పేరు ఎక్కడమే కాకుండా పాస్ బుక్ కూడా వస్తుందని, ఏడాదికి రెండుసార్లు రైతుబంధు అందుతుందన్నారు. ఇకపై అటవీ అధికారుల వేధింపులు ఉండవని, ఎరువులు, విత్తనాలు, పనిముట్లు సబ్సిడీపై అందుతాయని, రైతు చనిపోతే రూ.5లక్షల బీమా, క్రాప్ లోన్ సౌకర్యం ఉంటుందన్నారు.

విద్య, ఉద్యోగాల్లో ప్రాధాన్యం

రిజర్వేషన్ల పెంపుతో ఎస్టీలకు విద్యా, ఉద్యోగాల్లో లాభం చేకూరుతుందని, గురుకులాల సంఖ్య పెంపుతో ఆదివాసీ బిడ్డలకు కార్పొరేట్ విద్య అందుతుందన్నారు. పేరున్న మెడికల్ కాలేజీలు, ఐఐటీ, ఇంజినీరింగ్ కాలేజీల్లో సీట్లు సాధించింది గురుకులాల్లో చదివిన గిరిజన బిడ్డలేనని స్పష్టం చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి నేడు గిరిజన తండాలను పంచాయతీలుగా తీర్చిదిద్దామని పేర్కొన్నారు. పోడు వ్యవహారం రాష్ట్ర పరిధిలో ఉంటే ఎపుడో పట్టాల పంపిణీ జరిగిపోయేదని, కేంద్ర అటవీ చట్టం పరిధిలో ఉన్నందున ఆలస్యమైందన్నారు. కోట్లు ఖర్చు పెట్టి గిరిజన తండాలు, ఆదివాసీ గూడేలకు త్రీ ఫేస్ కరెంటు తీసువచ్చి, వంద యూనిట్లు ఉచిత కరెంటు అందిస్తున్నామన్నారు. అనంతరం మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ పట్టాలు అందని అర్హులకు రెండో విడతలో అందించేలా కృషి చేస్తామన్నారు. సీఎం కేసీఆర్ సంక్షేమం, అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మదన్ రెడ్డి మాట్లాడుతూ గతంలో గిరిజనులు అనేక ఇబ్బందులు పడ్డారని, పట్టాల పంపిణీతో అందరిలో సంతోషం నెలకొందని అన్నారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి, కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్లు ప్రతిమా సింగ్, రమేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ చంద్రాగౌడ్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

నర్సాపూర్: సీఎం కేసీఆర్ జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక నిధి ఏర్పాటు చేశారని, ఆపదలో ఉన్న వారికి సాయం అందిస్తున్నారని మంత్రి హరీశ్‌రావు అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో నర్సాపూర్, శివ్వంపేట మండలాలకు చెందిన జర్నలిస్టులకు ఇంటి స్థలాల పట్టాలను అందించారు. అభివృద్ధిని ప్రజలకు వివరించేలా కథనాలు రాయాలని కోరారు. సీఎం కేసీఆర్ కృషితో నర్సాపూర్ ఆర్టీసీ డిపో పూర్తయిందని, అర్బన్ పార్కు అభివృద్ధి జరిగిందన్నారు.

ఆకట్టుకున్న తలపాగా..

గిరిజనులు సేవాలాల్ జయంతి రోజున పెట్టుకునే తలపాగా (రుమాల్)ను మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, మదన్‌రెడ్డి, కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, ప్రజాప్రతినిధులు ధరించారు. ఇన్నాళ్లు సాగుచేసుకున్న పోడు భూములపై హక్కు లభించడంతో గిరిజనుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.



తలపాగాతో మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు మదన్‌రెడ్డి, పద్మాదేవేందర్‌రెడ్డి, కలెక్టర్ రాజర్షిషా, తదితరులు

క్లుప్తంగా

పాము కాటుతో రైతు మృతి


గంగయ్య (ఫైల్)

పాపన్నపేట(మెదక్): పాము కాటుతో రైతు మృతిచెందిన సంఘటన మండల కేంద్రమైన పాపన్నపేటలో శనివారం తెల్లవారుజాము జరిగింది. గ్రామానికి చెందిన కుమ్మరి గంగయ్య (55) శుక్రవారం పొద్దంతా పొలం పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికొచ్చి నిద్రించాడు. రాత్రి 10 గంటల ప్రాంతంలో చేయిపై కట్ల పాము కాటు వేసింది. దీంతో మెలకువ వచ్చిన అతడు దాన్ని చంపేశాడు. కొద్ది సేపటికే వళ్లంతా చమటలు పట్టడంతో పొరుగు గ్రామానికి కుటుంబీకులు తీసుకెళ్లి మంత్రం వేయించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో 108 వాహనంలో మెదక్ ఏరియా తీసుకెళ్లే సరికి చనిపోయాడు. అతడికి భార్య సుశీల, కొడుకు భూపాల్, కోడలు, మనవరాలు ఉన్నారు.

కోతుల దాడిలో గాయాలు

కొమురవెల్లి(సిద్దిపేట): స్థానిక మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చిన భక్తులపై ఆలయ పరిసరాలలో శనివారం కోతులు దాడి చేశాయి. స్థానికులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్‌కు చెందిన ఈర్లపల్లి స్వప్న కుటుంబసభ్యులతో కలిసి మల్లికార్జున స్వామివారి దర్శనానికి వెళుతుండగా అక్కడున్న కోతులు మూకుమ్మడి దాడి చేశాయి. ఈ దాడిలో స్వప్నకు గాయాలయ్యాయి. ఆలయ పరిసరాల్లో కోతుల బెడద లేకుండా చూడాలని ఆలయ అధికారులను భక్తులు కోరుతున్నారు.

గుడుంబా స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు


దాడుల్లో పాల్గొన్న అధికారులు

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండలం హనుమతండా, మహరాజ్ తండా తదితర తండాల్లో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ స్క్వాడ్స్ అధికారులు శనివారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. దాడుల్లో భాగంగా మహరాజ్‌తండాలో బానోత్ లలిత వద్ద లీటరున్నర గుడుంబా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా చేర్యాల ఎక్సైజ్ సీఐ మహేంద్రర్ కుమార్ మాట్లాడుతూ గుడుంబా తయారు చేసిన, అమ్మినవారిపై కఠినమైన చర్యలు తీసుకోనున్నామన్నారు. గుడుంబా అరికట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దీనిలో భాగంగానే గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ వినోద్, సురేష్, టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ సరిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తగ్గుతున్న పెట్టుబడి.. పెరుగుతున్న దిగుబడి

- రైతులకు అందుబాటులో ద్రవరూప ఎరువులు
- 8 శాతం అధికంగా చేతికొస్తున్న పంట
- రెండింటి ఖర్చుల్లో స్పష్టమైన వ్యత్యాసం
- అవగాహన సదస్సులు నిర్వహణలో అధికారుల విఫలం

50 కిలోల డీఏపీ, యూరియా ఎంత విస్తీర్ణానికైతే సరిపోతుందో అరలీటర్ డీఏపీ, అరలీటర్ యూరియా ద్రవరూపంలో అంతే విస్తీర్ణానికి సరిపోనుంది. దీంతో ఘనరూప ఎరువుల కన్నా, ద్రవరూపానికే సుమారు 8 శాతం పంట దిగుబడి పెరుగుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అంతే కాదు పెట్టుబడిలోనూ వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోందంటున్నారు. ద్రవరూప ఎరువుల వినియోగంపై రైతుల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత వ్యవసాయశాఖపై ఉంది.

కోహెడ(హుస్నాబాద్): ఎరువుల వాడకంలో మార్పులొచ్చాయి. మార్కెట్లో ఘన, ద్రవ రూప ఎరువులు లభిస్తున్నాయి. ఇంతవరకు బస్తాల్లో ఘనరూపంలో యూరియా, డీఏపీ లభించేది. ఇప్పుడు ద్రవరూపంలోనూ అందుబాటులోకి వచ్చాయి. అంతకుముందు 50 కిలోల డీఏపీ బస్తా సుమారు రూ.1,350, యూరియా బస్తా రూ.266 మార్కెట్‌లో ధర ఉంది. కాగా (ఇఫ్కో) కంపెనీ మార్కెట్‌లోకి ప్రవేశపెట్టిన నానో డీఏపీ అర లీటర్‌కు రూ 600, యూరియా అరలీటర్ రూ.240 ధరతో మార్కెట్‌లో అందుబాటులో ఉంది. ద్రవ రూప యూరియాపై రూ.26(266–240) డీఏపీ పై రూ.750(1350–600) వరకు ప్రయోజనం చేకూరుతోంది.

ద్రవరూప ఎరువుల ప్రయోజనం

అధికారుల అంచనా ప్రకారం ద్రవరూప ఎరువులతో పంటకు ప్రయోజనం సుమారు 90 శాతం ఉంటుందని తెలుపుతున్నారు. ఘనరూప డీఏపీ వరి నాటు వేసేటప్పుడు బస్తా డీఏపీ ఎంత విస్తీర్ణంలో వినియోగిస్తామో.. ద్రవరూప డీఏపీ అర లీటర్ బాటిల్ పొలంలో పిచికారి చేస్తే సరిపోనుంది. ద్రవరూపంలో పిచికారి చేస్తే మొక్కలు నత్రజని అవసరాన్ని సమర్థవంతంగా తీరుస్తుంది. దీంతో ఆకులలో కిరణజన్య సంయోగక్రియ పెరుగుతుంది. మొక్క వేర్లలో కణజలం వృద్ధిచెంది, పంట ఉత్పత్తిలో పోషక విలువలు పెంచుతుంది.

అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం

గ్రామాలలో రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవసాయ అధికారులు విఫలమయ్యారు. నానో డీఏపీ, యూరియా మార్కెట్‌లో ఉందని వాటి ప్రయోజనం ఇట్లా ఉంటుందని రైతులకు అవగాహన కల్పించటంపై పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వానాకాలం సాగుకు రైతులు సమయాత్తమయ్యారు. కానీ అధికారులు ఇప్పటికీ పలు ఫర్టిలైజర్స్ షాపులలో నానో డీఏపీని, యూరియాను రైతులకు సరిపడా స్టాక్ అందుబాటులో ఉంచడంలో విఫలమయ్యారు. అలాగే పంటసాగుపై అవగాహన సదస్సుల నిర్వహణ కరువైందని వ్యవసాయ అధికారులపై విమర్శలు లేకపోలేవు.



నానో డీఏపీ, యూరియా ద్రవరూప ఎరువులు

దిగుబడి పెరుగుతోంది



మండల రైతులకు ద్రవరూప డీఏపీ, యూరియా కొరత లేకుండా అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తున్నాం. వారంలో ఆగ్రోస్, డీసీఎంఎస్ షాపులకు స్టాక్ వచ్చేలా చర్యలు తీసుకుంటాం. వరి నాటుకు ముందుగా ఒకసారి మాత్రమే నానో డీఏపీని పొలంలో పిచికారీ చేయాలి. అలాగే నానో యూరియా లీటరు నీటికి 2 మి.లీ లేదా 4 మి.లీ చొప్పున కలిపి మొదటగా పంట పెరుగుదల దశలో తర్వాత నెలలోపు పూత దశలో రెండోసారి పిచికారీ చేయాలి. దీంతో రైతులకు సుమారు 8 శాతం పంట దిగుబడి పెరుగుతుంది.

– భోగేశ్వర్, మండల వ్యవసాయ అధికారి

సరిపడా స్టాక్ అందించాలి



ద్రవరూపంలోని నానో డీఏపీ, యూరియా బాటిల్‌ను ఆగ్రోస్, డీసీఎంఎస్ షాపులకు సరఫరా చేయాలి. రైతులకు సరిపడా స్టాక్ ఇవ్వాలి. వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలి.

– చొక్కరావు, అశ్విని ఫర్టిలైజర్ షాపు యజమాని

రైతు సదస్సులు ఏర్పాటు చేయాలి



ద్రవరూపంలోని యూరియా, డీఏపీ వాడకంపై అధికారులు రైతు సదస్సులు నిర్వహించాలి. సాగు సమయం దగ్గరకు వచ్చినా ఇంతవరకు వ్యవసాయ అధికారులు ఈ సదస్సులు ఏర్పాటు చేయడం లేదు. ఇప్పటికైనా రైతులకు అవగాహన కల్పించాలి.

– రాజు, తంగాళ్లపల్లి రైతు

సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి టోకరా

పటాన్‌చెరు టౌన్: కమీషన్ పేరిట ఆశ చూపి సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. దీంతో భారీ నగదు పోగొట్టుకొన్న బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ పరిధిలోని హెచ్‌ఎంటీ స్వర్ణపురి కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి జూన్ 28న పార్ట్ టైం జాబ్ అంటూ వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించాడు. అందులో తన వివరాలు నమోదు చేసుకున్నాడు. దీంతో సైట్ నిర్వాహకుడు అతడికి ఒక వాలెట్ ఐడీ ఇచ్చారు. అందులో ఉద్యోగి ముందుగా రూ.2 వేలు చెల్లించి ఇచ్చిన టాస్క్‌లు చేస్తున్నాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్ లో చూపిస్తున్నారు. ఈ క్రమంలో బాధితుడు తన భార్య నగలు అమ్మి, స్నేహితుల వద్ద అప్పు చేసి, జాబ్‌లోను ద్వారా మొత్తంగా 35 దఫాలుగా రూ.46 లక్షలు చెల్లించాడు. సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వాలెట్‌లో నగదుతోపాటు కమీషన్ నగదు చూపించారు. దీంతో ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతోపాటు కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు శనివారం ఫిర్యాదు అందించింది.

కట్కూర్‌లో బైక్ చోరీ

అక్కన్నపేట(హుస్నాబాద్): ఇంటి ముందు పార్కు చేసిన బైక్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన అక్కన్నపేట మండలం కట్కూర్‌లో చోటుచేసుకుంది. బాధితుడు, ఎస్‌ఐ తాండ్ర వివేక్ తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 5న గ్రామానికి చెందిన బొల్లి యాదగిరి తన బైక్ ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. మరుసటి రోజు తెల్లవారుజాము కనిపించలేదు. దీంతో చుట్టుపక్కలా వెతికాడు. తర్వాత భీమదేవరపల్లి మండలం కొత్తకుండ, మల్లారంలోని పెట్రోల్ బంక్‌లో ఉన్న సీసీ కెమెరా పుటేజీ పరిశీలించగా ఆరోజు అర్ధరాత్రి గుర్తుతెలియని ఇద్దరు టీవీఎస్ ఎక్సెల్ ఎత్తుకెళ్లి పెట్రోల్ కొట్టించుకున్నట్లు గుర్తించాడు. ఈ ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ముప్పిరెడ్డిపల్లిలో చోరీకి గురైన స్టార్టర్ బాక్స్

కేబుల్ వైర్లు, కాయల్స్ తస్కరణ

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులో పలువురు రైతులకు చెందిన వ్యవసాయ పొలాల వద్ద గల బోరు కేబుల్ వైర్లు, కాపర్ కాయల్స్‌ను గుర్తుతెలియని దుండగులు చోరీ చేసినట్లు శనివారం గ్రామస్తులు తెలిపారు. స్టార్టర్ బాక్స్‌లు సైతం ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

చేర్యాల(సిద్దిపేట): తాగుడుకు బానిసై ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణకేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని వేచరేణికి చెందిన మాదాసు యాదగిరి(38) సంవత్సరం క్రితం నుంచి కుటుంబంతో కలిసి పట్టణకేంద్రంలో నివాసం ఉంటున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసైన యాదగిరి శుక్రవారం భార్యను పుట్టినిల్లయిన రేబర్తిలో వదలిపెట్టొచ్చాడు. శనివారం వచ్చి తిరిగి తీసుకువెళ్తానని చెప్పి ఫోన్ చేసిన యాదగిరి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం పక్కింటి వారి ద్వారా తెలుసుకున్న భార్య ఇంటికి వచ్చి చూస్తే ఉరివేసుకొని విగత జీవిగా కనిపించాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

హీటర్ ఆన్ చేస్తుండగా షాక్

వివాహిత మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): స్నానానికి వెళ్లి హీటర్ ఆన్ చేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురైన మహిళ మృతిచెందింది. ఈ సంఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్‌లో శనివారం జరిగింది. పోలీసులు కథనం ప్రకారం.. కొత్తగూడెం ప్రాంతానికి చెందిన శిరీష(38)తన భర్తతో కలిసి విద్యుత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. భర్త వినోద్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. కాగా శనివారం శిరీష స్నానానికి వెళ్లింది. వేడి నీటి కోసం హీటర్ ఆన్ చేయగా విద్యుత్ షాక్‌కు గురైంది. బాత్‌రూమ్ నుంచి భార్య కేకలు విన్న భర్త వినోద్ అక్కడి చేరుకొని అపస్మరక స్థితిలో ఉన్న శిరీషను స్థానిక ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరుగురు జూదరులపై కేసు

కొండపాక(గజ్వేల్): పేకాట ఆడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ ఎస్‌ఐ సంపత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని బందారం శివారులో పాలడుగు ప్రతాప్‌రెడ్డి వ్యవసాయ పొలం వద్ద శనివారం రాత్రి ఆరుగురు పేకాట ఆడుతున్నారన్న సమాచారం పోలీసులకు చేరింది. వెంటనే ఎస్‌ఐ సంపత్ తన సిబ్బందితో.. పేకాట ఆడుతున్న ప్రాంతానికి చేరుకున్నారు. వీరిని చూసి తప్పించుకునేందుకు యత్నించిన నంగునూరు మండలంలోని వెల్కటూర్‌కు చెందిన ఆలేటి కిషన్, నంగునూరుకు చెందిన రాజాపేట హరిప్రసాద్, తిమ్మారెడ్డిపల్లికి చెందిన సార్ల నర్సయ్యలను పట్టుకున్నారు. మరో ముగ్గురు పరారయ్యారు. నిందితుల నుంచి 3 సెల్ ఫోన్లు, 5 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వివాహిత అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. అమీన్‌పూర్ ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... సెంతన్ గ్రీన్ పార్కులో ఉండే వివాహిత సరిత శనివారం మధ్యాహ్నం ఇంటి సమీపాన ఉన్న దుకాణానికి వెళ్లి ఎంతకీ రాలేదు. దీంతో భర్త లకన్ భార్య కోసం తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం సాయంత్రం భార్య అదృశ్యంపై భర్త పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విత్తనాలు కోసం వెళ్లి..


రమేశ్

చేగుంట(తూప్రాన్): వరి విత్తనాలు కోసం వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన చిట్టోజీవపల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఈదా రమేశ్ ఈనెల 5న వరివిత్తనాలు తీసుకొస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. ఆరోజు సాయంత్రం వరకు ఎంతకీ తిరిగి రాలేదు. అతడి భార్య లావణ్య ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. అప్పటి నుంచి బంధువులను విచారించినా రమేశ్ ఆచూకీ లభించలేదు. శనివారం భర్త అదృశ్యంపై భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటి నుంచి వెళ్లి..


యాదగిరి

పటాన్‌చెరు టౌన్: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సురేందర్ రెడ్డి కథనం ప్రకారం... పట్టణంలోని గోనెమ్మ బస్తీకి చెందిన ఆకుల యాదగిరి(70) శనివారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి ఎంతకీ తిరిగి రాలేదు. కాగా ఆందోళన పడిన కుటుంబసభ్యులు యాదగిరి కోసం తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆచూకీ లభించలేదు. ఆ మేరకు తండ్రి అదృశంపై కుమారుడు నవీన్ శనివారం రాత్రి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ బందోబస్తు మధ్య ఎల్లయ్య అంత్యక్రియలు

దుబ్బాక రూరల్: అక్బర్‌పేట భూంపల్లి మండలం చిట్టాపూర్‌లో ఎర్రొళ్ల ఎల్లయ్య, జిగిరి స్వామి.. ఇద్దరూ వారి ఇంటి పక్కన ఉన్న స్థలం విషయమై గతంలో పలుమార్లు గొడవ పడ్డారు. పాతకక్ష దృష్టిలో పెట్టుకొని ఈనెల 3న ఎల్లయ్యను జిగిరిస్వామి ట్రాక్టర్‌తో ఢీకొట్టడంతో అతడికి తీవ్రగాయాలై చికిత్సపొందుతూ మృతిచెందడం తెలిసిందే. శనివారం గాంధీ ఆస్పత్రి నుంచి మృతదేహం గ్రామానికి చేరుకుంది. ఎల్లయ్య మృతికి కారణమైన స్వామిపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరుగకుండా దుబ్బాక సీఐ కృష్ణ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సంఘటనా స్థలానికి ఏసీపీ దేవారెడ్డి చేరుకొని కుటుంబసభ్యులకు, గ్రామస్తులకు నచ్చజెప్పారు. నిందితుడు జిగిరిస్వామిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. పోలీస్ బందోబస్తు మధ్య ఎల్లయ్య అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు మహేందర్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.


కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఏసీపీ దేవారెడ్డి

తిమ్మాపూర్ ఘటనపై ఏసీపీ విచారణ

అందరూ సమష్టిగా జీవించాలని పిలుపు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిమ్మాపూర్‌లో కులవివక్ష ఘటనపై శనివారం గజ్వేల్ ఏసీపీ రమేశ్ విచారణ చేపట్టారు. గ్రామానికి చేరుకొని ముందుగా దళిత సామాజిక కుటుంబాలతో మాట్లాడారు. అనంతరం గ్రామంలోని బీసీ వర్గాల కుటుంబాలతో మాట్లాడి ఘటనకు సంబంధించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మారుతున్న కాలంలో నేటికీ అంటరానితనం, వివక్ష చూపడం సరైందికాదన్నారు. సమాజంలో అందరూ సమానమేనని, అన్ని కూలాల వారు అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉండాలని సూచించారు. కుల వివక్ష చూపవద్దని, సమానత్వంతో సమష్టిగా ఉండాలని కోరారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత గ్రామంలోని అందరిపై ఉందన్నారు. మధ్యవర్తుల మాటలతో చిన్నసమస్య పెద్దదిగా చేసుకోవద్దని, ముఖ్యంగా యువత సంయమనం పాటించాలని హితవుపలికారు. గ్రామంలో ఏ కులాల వారు కూడా విద్వేషాలకు పోవద్దని, ప్రేమను బంధాలతో కలివిడిగా ఉండాలన్నారు. ఫిర్యాదులు పరిశీలించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్‌ఐ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో గ్రామంలో బెల్టు షాపుల నిర్వాహకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి మద్యం బాటిళ్లను పోలీసులకు అప్పగించారు. ఇక నుంచి గ్రామంలో మద్యం విక్రయించబోమని పోలీసులతో అన్నారు. కార్యక్రమంలో సీఐ రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీరమేష్, నాయకులు సుమన్, యాదగిరి, రాజు, స్వామి, కనకయ్య, సత్యనారాయణ, మహేందర్, లక్ష్మణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


తిమ్మాపూర్ గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏసీపీ రమేశ్

ఓవర్‌టేక్ యత్నంలో ఢీకొన్న డీసీఎం

ఒడిశా వాసి మృతి, మరొకరికి తీవ్రగాయాలు

వర్గల్(గజ్వేల్): ఓవర్‌టేక్ చేసే యత్నంలో రోడ్డుపై ఆగి ఉన్న లారీని డీసీఎం ఢీకొట్టడంతో ఒడిశా వాసి మృతిచెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం తెల్లవారుజాము సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారం శివారులో రాజీవ్ రహదారిపై ఈ ఘటన జరిగింది. గౌరారం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ సంపత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు ఆయిల్ డ్రమ్స్‌తో బయలుదేరిన డీసీఎం శనివారం తెల్లవారుజాము సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారం శివారులో కెనాల్ దాటిన తరువాత ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో ఆగిఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో డీసీఎంలో ఉన్న సుశాంత్‌కుమార్ రౌత్(32), బజరంగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే సుశాంత్‌కుమార్ రౌత్ మృతి చెందాడు. బజరంగ్‌ను మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ అజాగ్రత్త, నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని, మృతుడి బంధువు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు. ప్రమాద సమయంలో డీసీఎంలో సుశాంత్ కుమార్ రౌత్, ఫిరోజ్‌ఖాన్, బజరంగ్, భీమ్లేష్ ఉన్నారు.


వర్గల్: క్షతగాత్రులు సుశాంత్‌కుమార్, బజరంగ్

ట్రాక్టర్ బోల్తా.. మత్స్యకారుడి దుర్మరణం


భానుచందర్ (ఫైల్)

హత్నూర(సంగారెడ్డి): చేపల వేట కోసం వెళ్తూ ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి మత్స్యకారుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన హత్నూర శివారులో శనివారం చోటుచేసుకుంది. మృతుడి కుటుంబీకులు, హత్నూర పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గుడాల భానుచంచర్(37) శనివారం గ్రామశివారులోని నడిమిచెరువు సమీపంలో గల తన పొలానికి వెళ్లి చేపలు పట్టుకొస్తానని కుటుంబీకులకు చెప్పి ట్రాక్టర్‌పై బయలుదేరాడు. నడిమిచెరువు సమీపంలోకి రాగానే ట్రాక్టర్ బోల్తాపడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య మహేశ్వరి, ఇద్దరు కుమారులు, కూతురున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహం నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానాకు తరలించినట్లు ఎస్‌ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

టిప్పర్, బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

కంది(సంగారెడ్డి): టిప్పర్, బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలపరిధిలోని కాశిపూర్‌లో చోటుచేసుకుంది. వివరాలిలా.. శనివారం మధ్యాహ్నం కాశీపూర్‌కు చెందిన షాబొద్దీన్ బైక్‌పై బెంగుళూరు బైపాస్ రోడ్డు దాటుతుండగా, కంది వైపు నుంచి శంకర్‌పల్లి వైపు వస్తున్న టిప్పర్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో షాబొద్దీన్‌కు గాయాలయ్యాయి. అయితే కాశిపూర్ చౌరస్తా వద్ద ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయని ఆగ్రహం చెందిన గ్రామస్తులు రోడ్డుపై రాస్తారోకో చేశారు. ఈ విషయమై అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రాజేష్ సంఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్తులకు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.

ఆటోను ఢీకొన్న కారు


బోల్తా పడిన ఆటో

కొల్చారం(నర్సాపూర్): ఆటోను వెనుక నుంచి కారు ఢీ కొట్టిన ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని సంగాయిపేట గ్రామశివారులోని మెదక్–జోగిపేట రహదారిపై శనివారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు.. మండలకేంద్రానికి చెందిన ఆటో.. ప్రయాణికులను ఎక్కించుకొని రంగంపేట వైపునకు వెళ్తున్నది. ఇదే సమయంలో మెదక్ వైపు నుంచి వస్తున్న కారు అతివేగంగా ఆటోను వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో రోడ్డు పక్కన చెట్టును ఆటో ఢీకొని బోల్తా పడింది. అందులో ఉన్న కొల్చారానికి చెందిన గడ్డం నరసమ్మ, మరో ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. పెంటమ్మకు కాలు విరిగింది. క్షతగాత్రులను మెదక్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారని తెలిపారు.

చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి


నర్సింగ్‌గౌడ్

చేగుంట(తూప్రాన్): ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన సంఘటన మాసాయిపేట మండలం రామంతపూర్ శివారులో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శివ్వంపేట మండలం గోమారానికి చెందిన నర్సింగ్‌గౌడ్ అతడి భార్య లత శుక్రవారం చేగుంట మండలం కర్నాల్‌పల్లి ఎల్లమ్మ వద్ద బంధువుల శుభకార్యంలో పాల్గొనేందుకు వచ్చారు. తిరుగుపయనంలో లత బంధువులతోపాటు స్వగ్రామానికి ఆటోలో నర్సింగ్‌గౌడ్(48) బైక్‌పై వెళుతున్నారు. ఈక్రమంలో రామంతపూర్ శివారులో బైక్ ముందు వెళుతున్న కంటైనర్ డ్రైవర్ అకస్మాత్తుగా మలుపు తీసుకున్నాడు. దీంతో బైక్‌పై వెళుతున్న నర్సింగ్‌గౌడ్ కంటైనర్‌ను ఢీకొని కిందపడిపోయి తలకు తీవ్రగాయాలయ్యాయి. గాయాలైన నర్సింగ్‌గౌడ్‌ను సికింద్రాబాద్ సుచిత్రలోని ఓప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు మృతదేహం పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపారు.

జహీరాబాద్‌లో..

జహీరాబాద్ టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్సపొందుతూ మృతిచెందాడు. చిరాగ్‌పల్లి ఎస్.ఐ.కాశీనాథ్ కథనం ప్రకారం.. మండలంలోని శేఖాపూర్‌కు చెందిన తాజొద్దీన్, మొగుడంపల్లి మండలం మన్నాపూర్‌కు చెందిన షహలానీ ఇద్దరూ స్నేహితులు. ఈనెల 6న పనిమీద మొగుడంపల్లి వెళ్లి బైక్‌పై జహీరాబాద్ తిరిగొస్తున్నారు. మొగుడంపల్లి సమీపంలో బ్రిడ్జి వద్ద కుక్క అడ్డం వచ్చింది తప్పించే క్రమంలో బైక్ పై నుంచి కిందపడ్డారు. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇందులో తాజొద్దీన్ పరిస్థితి విషయంగా ఉండడంతో హైదరాబాద్‌లోని బీరంగూడలో గల ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ అతడు చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

మూర్ఛతో వ్యక్తి...

పటాన్‌చెరు టౌన్: ఫిట్స్ వచ్చి రోడ్డుపై పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన భానూర్–బీడీఎల్ పోలీసుస్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం... ఏడాది క్రితం న్యాల్‌కల్‌కు చెందిన రాములు(52), భార్య పుణ్యమ్మ పిల్లలతో కలిసి మండలంలోని ఇస్నాపూర్‌కు బతుకుదెరువు కోసం వచ్చారు. అంబేడ్కర్ కాలనీలో నివసిస్తున్నారు. పాశమైలారం పారిశ్రామికవాడలో భార్యాభర్తలిద్దరూ వేర్వేరు కంపెనీలో పనిచేసుకునేవారు. రోజు మాదిరిగానే ఇద్దరూ కలిసి పారిశ్రామికవాడకు శనివారం వెళ్లారు. భార్య తాను పనిచేసే కంపెనీకి వెళ్లింది. భర్త నిక్కి టూల్స్ పరిశ్రమ సమీపంలో ఫిట్స్ వచ్చి రోడ్డు పడిపోయాడు. దీంతో స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న రాములు భార్య పుణ్యమ్మ అక్కడి చేరుకునేలోపే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


రాములు మృతదేహం